సాక్షి
చిత్తూరు
గురువారం । 30 । జనవరి । 2025



**మహిళలతో బైకు ర్యాలీ**
చిత్తూరులో హెల్మెట్‌లు ఉపయోగించాలనే నినాదంతో ట్రాఫిక్ పోలీసులు మహిళలతో బైకు ర్యాలీ చేశారు. - 8లో



**బంగారు నగల కోసమే హత్య**
బంగారు నగల కోసం పక్కింట్లోని వృద్ధురాలిని హతమార్చి పోలీసులకు పట్టుబడిన అక్క, తమ్ముడు. - 8లో



**దారి ఆక్రమణపై ధర్నా**
శ్మశానానికి వెళ్లే దారిని ఆక్రమించారని ఆర్డీఓ శ్రీనివాసులకు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు. - 8లో

## న్యూస్‌రీల్

### ఏనుగుల దాడికి నష్టపరిహారం



పరిహారం అందిస్తున్న ఎంపీడీఓ నారాయణ

సదుం : మండలంలో ఏనుగుల దాడుల్లో పంట నష్టపోయిన రైతులకు సోమల ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నష్ట పరిహారం పంపిణీ చేసినట్లు ఎఫ్ఎస్ఓ ఇంద్రాణి తెలిపారు. మండలంలో 52 మంది రైతులకు రూ. 4.65 లక్షల పరిహారం మంజూరైనట్లు చెప్పారు. పుంగనూరు అటవీ రేంజ్‌లో సదుం, సోమల, చౌడేపల్లె, పెద్దపంజాణి మండలాల్లో 129 మంది బాధిత రైతులకు 144 ఎకరాలకు సంబంధించి రూ. 11 లక్షల పరిహారం మంజూరైనట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ నారాయణ, ఎఫ్‌బీఓలు ఎస్‌ఆర్ రెడ్డి, షాజహాన్, మహేష్ పాల్గొన్నారు.

### భూసారంతోనే దిగుబడులు

శ్రీరంగరాజపురం : భూసారాన్ని రైతులు కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జె.మురళీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని చిన్నతయ్యూరు రైతుసేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. రసాయన మందులతో వ్యవసాయం తగ్గించి, ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. రసాయన మందులతో వ్యవసాయం చేస్తే నేల సారం క్షీణిస్తుందన్నారు. కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి నర్మద, సర్పంచ్ వరదమ్మ, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### 22వ రోజుకు చేరిన రైతు దీక్షలు



ప్లకార్డులు చేత పట్టి దీక్షలు కొనసాగిస్తున్న రైతులు

కుప్పంరూరల్ : కుప్పం మండలం, ఆవులనత్తం గ్రామం వద్ద జెల్లీ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా చేపట్టిన రైతు దీక్షలు బుధవారం 22వ రోజుకు చేరాయి. ఫ్యాక్టరీ నిర్వహణతో పంటలు, నివాస గృహాలకు నష్టం వాటిల్లుతోందని , ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ రైతులు దీక్షలు చేపట్టారు. అయినా అధికారులు, ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రైతులు దీక్షలు కొనసాగిస్తూనే ఉన్నారు. జిల్లా అధికారులు అయినా స్పందించి న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

### 'పది' పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో త్వరలో నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు వివరాలు పంపాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులు బుధవారం డీఈఓ కార్యాలయానికి చేరాయి. జిల్లాలో మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిర్వహణలో 6 సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చేందుకు వివరాలు సేకరించి ఫిబ్రవరి 3 లోపు నివేదికలు పంపాలని డీఈఓను ఆదేశించారు.

### ఫిబ్రవరి 3న సరస్వతీ యాగం

కాణిపాకం : వసంత పంచమిని పురస్కరించుకుని వచ్చేనెల 3వ తేదీన కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శ్రీ మహాసరస్వతీ యాగంను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు యాగం ప్రారంభమవుతుందన్నారు. ఈ యాగంలో విద్యార్థులు పాల్గొనవచ్చునని, విద్యార్థులకు ఉపయోగపడేలా వస్తువులు, ప్రసాదం ,కంకణం అందజేస్తామని వారు పేర్కొన్నారు.

### జాతీయ క్రీడా పోటీలకు పీడీ కృష్ణయ్య



పూతలపట్టు(కాణిపాకం): ఉత్తరాఖండ్‌లో జరగనున్న 38వ నేషనల్ గేమ్స్‌కు పూతలపట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న కృష్ణయ్య మోడరన్ పెంటాథలాన్ క్రీడాంశానికి టెక్నికల్ టైం కీపర్‌గా ఎంపికయ్యారు. ఫ్రిబవరి 4 నుంచి 17వ తేదీ వరకు జరిగే క్రీడా పోటీలకు ఆయన హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆయనను అభినందించారు.

### టీఐఎస్‌లో మార్పులకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభు త్వ యాజమాన్య ఉపాధ్యాయులు టీఐఎస్ (టిస్) లాగిన్‌లో మార్పులు చేసుకునేందుకు అవకాశం కల్పించారని డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, నగరపాలక సంస్థ పరిధిలోని టీచర్లు టిస్ లాగిన్‌లో ఈ నెల 31 లోపు మార్పులు చేసుకోవాలన్నారు. మార్పులను సరిచేసి ఈ నెల 31 లోపు సబ్మిట్ చేయాలన్నారు. టిస్ వివరాల ఆధారంగానే టీచర్ల ఉద్యోగోన్నతులు, బదిలీలు ఉంటాయని తెలిపారు.

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మరో మైలురాయిని అధిగమించింది. సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్‌వీ ఎఫ్ 15 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసింది. మువ్వన్నెల ఖ్యాతిని దిగంతాలకు చాటింది. సెకండ్ జనరేషన్ ఉపగ్రహం నావిక్–2ను సమర్థవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో నావిగేషన్ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ప్రతిష్ఠాత్మక వందో ప్రయోగం పకడ్బందీగా పూర్తి కావడంతో షార్ శాస్త్రవేత్తల్లో ఆనందం వెల్లివిరిసింది. నిప్పులు చిమ్ముకుంటూ నింగికేగుతున్న రాకెట్‌ను వీక్షించి సందర్శకుల్లో ఉత్సాహం ఉరకలేసింది.

# వందనం.. అభినందనం



సగర్వంగా రోదసిలోకి దూసుకువెళుతున్న జీఎస్ఎల్‌వీ ఎఫ్15 (ఇన్‌సెట్) నిప్పులు చిమ్ముతూ పయనిస్తున్న రాకెట్



మూడు దశలతో రోదసీ దిశగా వెళుతున్న రాకెట్



మొదటిదశ పూర్తి కావడంతో రెండోదశతో ప్రయాణం..



హీట్‌షీల్డ్స్ విడిపోతున్న దృశ్యం



రాకెట్‌లోని రెండోదశ మండుతూ..



మూడోదశ అంటే క్రయోజనిక్ దశలో ఉపగ్రహాన్ని కక్ష దిశగా తీసుకెళుతూ..



నావిక్-2 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి వదిలిపెడుతూ..

**విజయవంతంగా జీఎస్ఎల్‌వీ ఎఫ్15 ప్రయోగం**

- నిప్పులు చిమ్ముకుంటూ నింగికేగిన రాకెట్
- క్షక్ష్యలోకి చేరిన నావిక్- ఉపగ్రహం
- షార్ శాస్త్రవేత్తల్లో అవధులు దాటిన ఆనందం
- ప్రతిష్టాత్మక మైలురాయిని అధిగమించిన ఇస్రో

సూళ్లూరుపేట : సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి బుధవారం ఉదయం 6.23 గంటలకు జీఎస్ఎల్‌వీ ఎఫ్15 రాకెట్ విజయవంతంగా రోదసీలోకి దూసుకెళ్లింది. మొత్తం ప్రయోగం 19.10 నిమిషాల్లోనే పూర్తయింది. 2,250 కిలోలు బరువు కలిగిన నావిక్–2 ఉపగ్రహం విజయవంతంగా కక్ష్యలోకి చేరింది. నావిగేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఐఆర్ఎన్ఎస్ఎస్‌కు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు సెకెండ్ జనరేషన్ ఉపగ్రహమైన నావిక్–2ను ఇస్రో శాస్త్రవేత్తలు ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టారు. ఈ ప్రయోగంతో షార్ సగర్వంగా సెంచరీ మైలు రాయి మీద నిలబడింది. ఇస్రో ప్రయోగాల పరంపరలో ఎన్నో మైలురాళ్లు దాటింది. అయితే ఇది వందో ప్రయోగం కావడంతో చరిత్ర పుటల్లోకెక్కింది.

**గ్యాలరీలో వీక్షకుల సందడి**

జీఎస్ఎల్‌వీ ఎఫ్15 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు 6 వేల వరకు తరలి వచ్చారు. వందో ప్రయోగం కావడంతో తెల్లవారుజామునే మంచును సైతం లెక్క చేయకుండా వీక్షకుల గ్యాలరీలోకి చేరుకున్నారు. రోదసీలోకి రాకెట్ దూసుకెళుతుంటే జయహో భారత్,.. జయహో ఇస్రో.. అంటూ నినాదాలు చేశారు. జాతీయ జెండాలను చేతపట్టి సగర్వంగా కేరింతలు కొట్టారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు కార్లు, స్కూల్ వ్యాన్లు, బస్సులు బారులు తీరి కనిపించాయి.



గ్యాలరీ నుంచి రాకెట్ ప్రయోగం వీక్షిస్తున్న ప్రేక్షకులు

**శుభాకాంక్షల వెల్లువ**

జీఎస్ఎల్‌వీ ఎఫ్15 ప్రయోగం విజయవంతం కావడంపై ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. వంద ప్రయోగాలు పూర్తి చేసి చరిత్ర సృష్టించినందుకు ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఇతర శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

## దశలవారీగా ప్రయోగం ఇలా..

- జీఎస్ఎల్‌వీ ఎఫ్15 రాకెట్‌కు మంగళవారం వేకువజామున 2.53 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. 27.30 కౌంట్‌డౌన్ సమయంలో రాకెట్‌లోని లిక్విడ్ స్ట్రాపాన్ బూస్టర్లలో ద్రవ ఇంధనం నింపే ప్రకియను చేపట్టారు.
- బుధవారం ఉదయం 6.23 గంటలకు కౌంట్‌డౌన్ ముగిసిన వెంటనే 0.00 నిమిషాలకు కోర్ అలోన్ దశలో 138.1 టన్నుల ఘన ఇంధనం, రాకెట్‌కు చుట్టూ వున్న నాలుగు స్ట్రాపాన్ బూస్టర్లలో నింపిన 170.7 టన్నుల ద్రవ ఇంధనం మండించి మొదటిదశను 151.2 సెకెండ్లకు పూర్తి చేశారు.
- రాకెట్‌లోని రెండోదశను 149.6 సెకెండ్లకు మండించి 151.2 సెకెండ్లకు పూర్తి చేశారు. ఈ దశలోనే రాకెట్ శిఖరభాగంలో ఉపగ్రహానికి అమర్చిన హీట్‌షీల్డ్స్ 237.42 సెకెండ్లకు విడిపోయాయి.
- రాకెట్‌లోని మూడోదశ అంటే క్రయోజనిక్ దశను 295.68 సెకెండ్లకు మండించి 1135.38 నిమిషాలకు కటాఫ్ చేశారు. మళ్లీ 1140.38 సెకెండ్లకు క్రయోజనిక్ ఇంజిన్ మండించి 1147.38 సెకెండ్లకు (19.10 నిమిషాలు) 2,250 కిలోలు బరువు కలిగిన నావిక్–2 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టి సెంచరీ ప్రయోగాన్ని విజయవంతగా కేవలం 19.10 నిముషాల్లో పూర్తి చేశారు.

## నాలుగు విఫలం.. 13 సఫలం

జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇస్రో ఇప్పటి వరకు 17 ప్రయోగాలు చేసింది. అందులో 13 ప్రయోగాలను విజయవంతం కాగా, కేవలం నాలుగు ప్రయోగాలు మాత్రమే విఫలమయ్యాయి. బుధవారం నిర్వహించిన జీఎస్ఎల్‌వీ ఎఫ్15 ఈ సిరీస్‌లో 17వ ప్రయోగం. ఇది వందో ప్రయోగం కావడంతో శాస్త్రవేత్తల్లో కొంత టెన్షన్ వుంటుంది. ఎందుకంటే 2010 ఏప్రిల్ 15న స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన క్రయోజనిక్ దశతో చేసిన జీఎస్ఎల్‌వీ డీ3 ప్రయోగం విఫలమైంది. అదే సంవత్సరం డిసెంబర్ 25న జీఎస్ఎల్‌వీ ఎఫ్6 ప్రయోగంలో రష్యన్ క్రయోజనిక్ దశతో చేసినప్పటికీ విఫలమైంది. ఈ రాకెట్ నింగివైపునకు వెళ్లేటపుడు క్రయోజనిక్ దశ కిందిభాగంలో వున్న స్టడ్ విరిగిపోవడంతో మిషన్ కంట్రోల్ రూమ్ నుంచే బ్లాస్ట్ చేశారు. తర్వాత 2010 నుంచి 2014 దాకా జీఎస్ఎల్‌వీ ప్రయోగాల జోలికే ఇస్రో పోలేదు. క్రయోజనిక్ ఇంధనం లిక్విడ్ అక్సిడైజర్, లిక్విడ్ హైడ్రోజన్ కలిపి మైనస్ 220 డిగ్రీల ఉష్ణోగ్రతలో తయారు చేయాల్సి ఉంటుంది. అందుకే సంక్లిష్టమైన క్రయోజనిక్ టెక్నాలజీని అందుకోవడానికి తొలి నాళ్లలో కాస్త ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ నేడు సగర్వంగా నిలబడింది.



2010 డిసెంబర్ 25న విఫలమైన జీఎస్ఎల్‌వీ ఎఫ్6 రాకెట్‌ను బ్లాస్ట్ చేసిన దృశ్యం (ఫైల్)

# ఈవ్ టీజింగ్‌పై ఫిర్యాదు చేయండి

- పిల్లల సంరక్షణ కేంద్రాల్లో పటిష్ట భద్రత
- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు భూ కేటాయింపులు చేయండి
- వరుస సమీక్షల్లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో ఈవ్ టీజింగ్ సమస్యలపై నేరుగా తనకు, జేసీకి ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖలతో వరుస సమీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా సమాజంలో మహిళలు, పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపుల నుంచి కాపాడేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు వేధింపులకు గురైతే గ్రీవెన్స్‌లో నేరుగా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఆడపిల్లలు, మహిళల సంరక్షణకు సంబంధించిన చట్టాలపై విస్తృతంగా క్షేత్రస్థాయిలో అవగాహన పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.

**ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించండి**

క్షేత్రస్థాయిలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సాహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవసరమైన భూ కేటాయింపులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం అమలు చేస్తోందన్నారు. భూమి కేటాయింపులకు అనుసరించాల్సిన నియమాలను అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు రూ.544 కోట్లతో 59,044 మందికి ఉపాధి కల్పించేలా 14,761 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉదయం పోర్టల్ దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సివిల్ జడ్జి భారతి, డీఈఓ వరలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరీ, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, పరిశ్రమల శాఖ జీఎం వెంకట్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఎల్‌డీఎం హరీష్ పాల్గొన్నారు.

## 2,800 స్వయం ఉపాధి యూనిట్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హత, ఆసక్తి ఉన్న వారు స్వయం ఉపాధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని బీసీ, ఈబీసీ, రెడ్డి, కమ్మ, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గాలు స్వయం ఉపాధి రుణాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. జిల్లాలో రూ.30.62 కోట్ల సబ్సిడీ, రూ.30.62 కోట్లు బ్యాంకు రుణం మొత్తం రూ.61.25 కోట్ల విలువతో 2,800 స్వయం ఉపాధి యూనిట్లు 2800 మందికి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 21–60 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. కాపు కార్పొరేషన్ వారికి మాత్రం వయస్సు 21–50 ఏళ్ల మధ్య ఉండొచ్చని తెలిపారు. కుల ధ్రువీకరణపత్రం, రేషన్ కార్డు, వయస్సు ధ్రువీకరణపత్రం, ఆధార్ , బ్యాంకు పాసు పుస్తకం కలిగి ఉండాలన్నారు. ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 7వ తేదీ లోపు అర్హత, ఆసక్తి ఉన్న వారు సమీపంలోని సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ సహకారంతో www.apobmmr. dev.nidhi.apcfrr.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని ఈడీ తెలిపారు.

# వాట్సాప్ గ్రూపులు హ్యాక్

- మొబైల్ యాప్‌లతో సైబర్ మోసం




ఫోన్ హ్యాక్ చేసిన యాప్

నగరి : ఇంటర్నెట్ వినియోగం లేనిదే సమయం గడవని పరిస్థితులు నెలకొన్నాయి. వాట్సాప్ కేంద్రంగా సైబర్ నేరగాళ్ల ఆన్‌లైన్స్‌మోసాలకు పాల్పడడం కలకలం రేపుతోంది. వాట్సాప్ గ్రూపులలో యాప్‌లు పంపుతూ వాటిని టచ్ చేస్తే గ్రూప్‌లు హ్యాక్ చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లే గ్రూపు అడ్మిన్‌లుగా మారిపోతున్నారు. యాప్‌ను టచ్ చేసే వ్యక్తి ఫోన్ హ్యాకర్ల కంట్రోల్‌కు వెళుతోంది. ఇదీగాక తమ ఖాతాల్లో ఉన్న నగదును వెనువెంటనే బ్యాంకులకు వెళ్లి డ్రా చేసేస్తున్నారు. ఇలా నగరి పట్టణంలోని కుమార్ అనే వ్యక్తికి ఇండియా మార్కెట్ మనీ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ పేరిట రూ. వెయ్యి చెల్లిస్తే రూ.10 వేలు వస్తుంది, రూ.3 వేలు చెల్లిస్తే రూ.18 వేలు వస్తుంది అంటూ టారిఫ్ చూపుతూ వచ్చే యాప్‌ను క్లిక్ చేయడంతో అతను అడ్మిన్‌గా ఉన్న గ్రూపు హ్యాక్ అవడంతో పాటు ఆ గ్రూపుకు ఫారిన్ నంబరు అడ్మిన్‌గా మారింది. దీంతో ఫోన్ తీసుకొని పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా ఫోన్ ఐఎంఐఈ నంబరు హ్యాక్ చేశారని ఆ ఫోన్ వాడొద్దని సూచించారు. ఇలా విజయపురానికి చెందిన రాము అనే వ్యక్తి పీఎం కిసాన్ వివరాలకు యాప్ క్లిక్ చెయ్యండని వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగా అతను ఏ గ్రూపుల్లో ఉన్నారో వారందరికీ వరుసకట్టి ఆ యాప్ వెళ్లింది. దీంతో అతను సిమ్ కార్డు తొలగించడంతో పాటు హుటాహుటిన బ్యాంకుకు వెళ్లి ఉన్న డబ్బులు డ్రా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై సీఐ మహేశ్వర్ మాట్లాడుతూ..ఆన్‌లైన్ లో సెర్చ్ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆశలను రేకెత్తించే విధంగా వచ్చే యాప్‌ల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. సైబర్ మోసం బారిన పడితే వెంటనే పోలీసులను సంప్రదించాలని సీఐ తెలిపారు.

## అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలని రాష్ట్రపతికి లేఖలు



సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రపతికి లేఖలు రాస్తున్న సిబ్బంది

కార్వేటినగరం : అంగన్‌వాడీ కార్యకర్తలను కోర్టు తీర్పు ప్రకారం క్రమబద్ధీకరించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా బుధవారం కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ సిబ్బంది సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రపతికి లేఖలు రాశారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అలాగే హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు విజయ, మమత మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను నిర్లక్ష్యం చేస్తున్నారని కోర్టు తీర్పు ప్రకారం ఐసీడీఎస్‌ను సంస్థాగతం చేయాలని డిమాండ్ చేశారు. శిశు, మరణాల రేటు తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరాల కొద్ది పని చేస్తున్న అంగన్‌వాడీలపై పనిభారం పెంచడంతో రకరకాల పద్ధతుల్లో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. అంగన్‌వాడీల వద్ద డబ్బులు వసూలు చేసే కార్యక్రమం తీవ్రమైందని ఆరోపించారు. ప్రాజెక్టులో ఒకరిద్దరు నాయకులుగా చెలామణి అవుతూ అధికారులకు తొత్తులుగా ఉంటూ అంగన్‌వాడీలను బెదిరించే పనులు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డెమ్మ(శ్రీరంగరాజపురం) పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 6 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సాక్షి ఎఫెక్ట్..

నగరి : కుశస్థలికి గర్భశోకం అంటూ ఇసుక ధందాను వివరిస్తూ సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కుశస్థలి నదిలో ఇసుక తరలిస్తున్న 6 ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సదుం : విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ షేక్‌షావలి కథనం మేరకు..ఎగువ జాంద్రపేటకు చెందిన అల్లాబకష్ (57) గ్రామ సమీపంలో 10 గుంటల స్థలం లీజుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. పొలం పనులకు వెళ్లిన అతను పొలం వద్ద ఉన్న మరో రైతుకు చెందిన మోటార్ షెడ్ సమీపంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెంది ఉండగా కుటుంబికులు గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలు విచారణలో తెలియాల్సి ఉంది. కుమారుడు తాహీత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరుకు తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

– ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న టాటా ఏస్ వాహనం



నవీన్ (ఫైల్)

పుంగనూరు : మండలంలోని సుగాలిమిట్ట వద్ద వేగంగా వచ్చిన టాటా ఏస్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వాహనచోదకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని తాటిమాకులపాళెంకు చెందిన నవీన్(26) మదనపల్లె ప్రైవేటు బ్యాంకులో పని చేస్తున్నాడు. ఉదయం డ్యూటీకి ద్విచక్ర వాహనంలో బయలుదేరిన నవీన్‌ను టాటాఏస్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. 108 వాహన సిబ్బంది వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

### ఏఈలకు మండలాలు కేటాయింపు

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా ట్రాన్స్‌కో పరిధిలో పలువురు సబ్ ఇంజినీర్ల నుంచి ఏఈలుగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. వీరికి మండలాలు కేటాయిస్తూ సీఎండీ సంతోషరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పాలసముద్రానికి లోకేష్‌రెడ్డి, బంగారుపాళ్యం టౌన్‌కు దేవిప్రసన్న, పైపల్లెకు తారాదేవి, బైరెడ్డిపల్లెకు ప్రసాద్, పుంగనూరు టౌన్‌కు ఉమా మహేశ్వర్‌రావులను నియమించారు. వీరు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

# ఆక్రమించి.. బెదిరించి..!

- దళితుల పొట్టగొడుతున్న కూటమి నేతలు
- 30 ఏళ్లుగా సాగులో ఉన్న భూమి ఆక్రమణకు యత్నం
- న్యాయం చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట మొక్కలతో ధర్నా చేస్తున్న పాతపాళెం హరిజనవాడ దళితులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు మాసాల్లోనే భూ కబ్జాలు, దళితులపై దాడులు పేట్రేగిపోతున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఏదైనా చేయొచ్చు అనే ధీమాతో టీడీపీ కూటమి నాయకులు ప్రవర్తిస్తున్నారు. న్యాయం చేయాల్సిన రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. జిల్లాలోని గంగాధర నెల్లూరు మండలం శ్రీరంగరాజపురం మండలం పాతపాళెం హరిజనవాడకు చెందిన దళితుల భూములను అధికార అండదండలతో కాజేసేందుకు కుట్రలు చేస్తున్నారు. దీంతో ఆ బాధితులు మొక్కలను చేతిలో పెట్టుకుని న్యాయం చేయాలంటూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు.

**సమస్య ఇది...**

గంగాధర నెల్లూరు మండలం శ్రీరంగరాజపురం మండలంలోని పాతపాళెం హరిజనవాడకు సమీపంలోని కంబరాయనిగుట్ట వద్ద సర్వే నెంబర్ 109లో దాదాపు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని చదును చేసుకుని అక్కడే నివాసం ఉంటూ కొందరు దళితులు 1995వ సంవత్సరం నుంచి టేకు, మామిడి మొక్కలను సాగు చేసుకుంటున్నారు.ప్రస్తుతం ఆ భూమిని కబ్జా చేసేందుకు అధికార పార్టీకి చెందిన కొందరు ప్రయత్నాలు చేస్తూ దళితులను బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఆ భూమికి 2005లో భూ పంపిణీ పథకంలో వెంకటేశులు పేరుతో డీకేటీ పట్టా మంజూరు చేసేందుకు అప్పటి అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అసైన్‌మెంట్ కమిటీ సైతం ఆమోదం తెలిపింది. కసరత్తు అంతా చేసినప్పటికీ పట్టా ఇవ్వకుండా ఆపేశారు.

– పాతపాళెం హరిజనవాడకు చెందిన శాంతమ్మకు 2010లో 5వ విడత భూపంపిణీలో అప్పటి ప్రభుత్వం 162 నంబర్‌తో పట్టా జారీ చేసింది. అప్పటి ప్రభుత్వం జారీచేసిన గుట్టపోరంబోకు పొలంలో ఆమె మామిడి, ఇతర మొక్కలను సాగు చేసుకుంటోంది. ప్రస్తుతం ఆ పొలంలోని మామిడి చెట్లు 100, టెంకాయచెట్లు 15 వరకు అధికారపార్టీకి చెందిన అగ్రకులస్థులు వెళ్లి ధ్వంసం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడమే ఈ దళితులకు శాపంగా మారింది.

**గోడు పట్టించుకోని రెవెన్యూ అధికారులు**

తమకు న్యాయం చేయండంటూ పాతపాళెం హరిజనవాడకు చెందిన దళితులు మంగళవారం శ్రీరంగరాజపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆత్మహత్యకు చేసుకునేందుకు ప్రయత్నించారు. అక్కడ ఎవ్వరూ స్పందించకపోవడంతో న్యాయం కోసం చిన్నపిల్లలతో కలిసి కలెక్టరేట్ కు వచ్చామని కన్నీరు మున్నీరయ్యారు.

**దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నారు**



30 ఏళ్లుగా భూమి మా అనుభవంలో ఉంది. ఆ భూమిలోనే పంటలు పెట్టి పైపులేసి సాగు చేస్తున్నాం. భూమిలోని పైపులు, మొక్కలను ధ్వంసం చేసేశారు. మాపై అర్జీలు పెట్టిన నాయుళ్లు అధికారులను అడ్డు పెట్టుకుని బెదిరిస్తున్నారు. కలెక్టర్ సారుకు మా గోడు చెప్పుకుందామని వచ్చాం.

– నాగయ్య, పాతపాళెం దళితుడు, శ్రీరంగరాజపురం మండలం.

**కష్టపడి మొక్కలు నాటుకున్నాం**



అప్పట్లో గుట్టలో భూమి ఇచ్చి పంటలు వేసుకుని బతుక్కోమన్నారు. రేయింబవళ్లు కష్టపడి సాగుచేసుకున్నాం. మండల వీఆర్వో చంద్రబాబు, తలారి నాయుళ్లను వెంటబెట్టుకొచ్చి వచ్చి పొలంలో మొక్కలను పెరికించేశారు. మందిరి చిన్నబ్బ, రాజేష, డిల్లీబాబు, చంద్రబాబు, పెద్దబ్బ వచ్చి దాడికి ప్రయత్నించారు. వీఆర్వో చంద్రబాబుకు రూ.30 వేలు లంచం ఇచ్చా.

– దాక్షయణి, దళిత మహిళ, పాతపాళెం హరిజనవాడ

## ఆర్‌ఎంపీ వైద్యం వికటించి చిన్నారి మృతి



ఆర్‌ఎంపీలతో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లెకు చెందిన ఇద్దరు ఆర్‌ఎంపీల వైద్యం వికటించి ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో బుధవారం వైద్యాధికారులు అరుణ్‌కుమార్, విజయ్‌చంద్ర, ఎస్ఐ పరశురాముడు, తహశీల్దార్ మాధవరాజు, ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ ఆర్‌ఎంపీలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మండలంలోని టీఎస్‌కుప్పం గ్రామానికి చెందిన రాజేష్ కుమార్తె వైష్ణవి (10)కి వారం రోజుల కిందట జ్వరం రావడంతో బైరెడ్డిపల్లెలోని ఓ ఆర్‌ఎంపీని సంప్రదించి వైద్యం చేయించారు. జ్వరం తగ్గకపోవడంతో మూడు రోజుల కిందట మరో ఆర్‌ఎంపీ దగ్గర వైద్యం చేయించారు. జ్వరం తగ్గకపోవడంతో పలమనేరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చిన్నారి మృతి చెందింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు క్లినిక్ నందు ఇంజెక్షన్‌లు, సెలైన్లు ఇవ్వకూడదన్నారు. ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు.

### దారి ఆక్రమణపై ధర్నా

శాంతిపురం : కరేగానూరు గ్రామ శ్మశానానికి వెళ్లే దారిని కొందరు ఆక్రమించి చదును చేస్తున్నారని గ్రామస్తులు బుధవారం మండల సచివాలయం ఎదుట ధర్నాకు దిగారు. కార్యాలయం ఎదుట బైటాయించి తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపారు. అదే సమయంలో కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు అక్కడికి రావడంతో ఆయనకు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ ఆదేశాలతో రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు నేరుగా వెళ్లి శ్మశానానికి రోడ్డును పునరుద్ధరించారు. స్థానిక టీడీపీ నేత 3.51 ఎకరాల అసైన్డ్ భూమిని కబ్జా చేసి చదును చేసే ప్రయత్నంలోనే దారి సమస్య తలెత్తినట్లు సమాచారం.

### మహిళలతో బైకు ర్యాలీ

చిత్తూరు అర్బన్ : ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్లను తప్పనిసరిగా పెట్టుకోవాలని చిత్తూరు మేయర్ అముద, చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) ఛైర్‌పర్సన్ కటారి హేమలత పిలుపునిచ్చారు. బుధవారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద ట్రాఫిక్ పోలీసులు.. హెల్మెట్ ఉపయోగించాలనే నినాదంతో మహిళలతో ద్విచక్రవాహనాలు నడుపుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేయర్, చుడా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. స్కూటర్లు నడిపే ప్రతి మహిళా హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. వాహనం వెనుక కూర్చునేవారు కూడా హెల్మెట్ పెట్టుకోవడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలతో బయటపడే అవకాశం ఉందన్నారు. వెంట్రుకలు రాలిపోతాయని, మేకప్ చెరిగిపోతుందని మహిళలు హెల్మెట్‌ను తిరస్కరించకూడదన్నారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు మాట్లాడుతూ.. స్కూటర్లు నడిపే మహిళలు హెల్మెట్లను ఉపయోగించడంతో పాటు.. ఇంట్లో ద్విచక్రవాహనాలు తీసుకెళ్లే మగాళ్లకు తప్పనిసరిగా హెలెట్లు ఇవ్వాలన్నారు.

# బాధిత కుటుంబానికి పెద్దిరెడ్డి భరోసా



రొంపిచెర్లలో బాధితుడు కుమార్‌రాజా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పెద్దిరెడ్డి

రొంపిచెర్ల : విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కుమార్‌రాజా కుటుంబానికి అండగా ఉంటానని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భరోసా కల్పించారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. విద్యుత్ షాక్ ఘటన ఎలా జరిగిందని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అడవి పందులకు వేసిన విద్యుత్ తీగలకు పడినట్లు ఉందని, కానీ గుట్టు చప్పుడు కాకుండా శవాన్ని అక్కడి నుంచి తెచ్చి ఇంటి ముందు ముళ్లపొదల్లో పడేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధలో ఉన్నామని, న్యాయం జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కేసులో ఎంతటి వారు ఉన్నా వదిలే ప్రసక్తే లేదని న్యాయం చేస్తామని బాధిత కుటుంబ సభ్యులైన యోగేష్, లోకేష్‌కు పెద్దిరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మెన్ కుమార్ రాజా, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా, జిల్లా కార్యదర్శి కోటా వెంకటరమణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చెంచురెడ్డి, దేవులపల్లె హరినాథరెడ్డి, ఎల్.మహబుబ్‌బాషా, అల్లాబక్స్, విజయశేఖర్, కరీముల్లా, సూర్య నారాయణ రెడ్డి, రామనారాయణ రెడ్డి, శ్రీనాథనాయుడు, సదా శివరెడ్డి, రవీంద్ర, కమలాకర్ రెడ్డి, రాజా సాహెబ్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

### దళిత రైతు మృతదేహానికి నివాళి

సదుం : టీడీపీ నాయకుడి దాడిలో మృతి చెందిన దళిత రైతు రమణయ్య మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్పతో కలసి బుధవారం నివాళులర్పించారు. కుటుంబికులను పరామర్శించి, న్యాయం జరిగేలా చూస్తామని, తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాగా ఈ సంఘటనకు సంబంధించి నిందితుడు పవన్ కుమార్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్‌షావలి చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ధనుంజయరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పుత్రాజు, హరినాథ రెడ్డి పాల్గొన్నారు.

# బంగారు నగల కోసమే హత్య

- వృద్ధురాలి హత్య కేసులో అక్క, తమ్ముడు అరెస్టు
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ



వృద్ధురాలి హత్య కేసులో నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ , సీఐ

బంగారుపాళెం : బంగారు నగల కోసం అక్క, తమ్ముడు పక్కింటిలో ఉంటున్న వృద్ధురాలిని హత్య చేశారని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. బుధవారం సాయంత్రం బంగారుపాళెం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితులను అరెస్టు చూపి వృద్ధురాలి హత్య కేసు వివరాలను వెల్లడించారు. బంగారుపాళెం మండలం తగ్గువారిపల్లె పంచాయతీ ఆర్‌ఆర్ నగర్‌లో రాజేంద్రనాయుడు భార్య సునందమ్మ(71) నివాసం ఉంటున్నారు. ఈనెల 19వ తేదీన సునందమ్మ మృతి చెందింది. సునందమ్మ కుమారుడు సంతోష్ తన తల్లి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును చాలెంజ్‌గా తీసుకున్న సీఐ శ్రీనివాసులు, సిబ్బంది కేసు దర్యాప్తు ప్రారంభించారన్నారు. సునందమ్మ నివాసముంటున్న ఇంటి పక్కనే దామోదర్‌నాయుడు కుమారుడు లీలామనోహర్‌నాయుడు, తల్లి వసంతమ్మ ఉంటున్నారు. ఇటీవల పలమనేరులో ఉంటున్న అక్క దుర్గ ఆర్‌ఆర్ నగర్‌లో తల్లి ఇంటికి వచ్చింది. అక్క దుర్గా, తమ్ముడు లీలామనోహర్ అప్పులు చేసి వాటిని తీర్చలేక పక్కింటిలో ఉంటున్న వృద్ధురాలు సునందమ్మను ఇంట్లో ఎవరూ లేని సమయంలో ముఖంపై దిండుతో గట్టిగా అదిమి హత్య చేసి వృద్ధురాలి దగ్గర ఉన్న రూ.12 లక్షల విలువ చేసే 176 గ్రాముల బంగారు నగలను దోచుకుని వెళ్లారు. పక్కింటిలో ఉన్న సునందమ్మ సాధారణంగా చనిపోయిందంటూ చిత్రీకరించారు. క్లూస్ టీం ద్వారా సేకరించి వివరాలు, సాంకేతికతను ఉపయోగించి వృద్ధురాలి కేసులో అసలు ముద్దాయిలు ఎవరనేది ఛేదించారన్నారు. వృద్ధురాలిని హత్య చేసిన దుర్గా (29), ఆమె తమ్ముడు లీలామనోహర్ నాయుడు(23)ను బుధవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి రెండు బంగారు నెక్లెస్‌లు, బంగారు చైను, 2 బంగారు గాజులు మొత్తం 176 గ్రాముల బంగారు నగలను రికవరీ చేసినట్లు తెలిపారు. 10 రోజుల్లోనే కేసు ఛేదించిన సీఐ, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

# అక్రమ కేసులతో పోలీసుల వేధింపులు

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డికి ప్రజల మొర



ఎమ్మెల్యే పెద్దిరెడ్డికి సమస్యలు వివరిస్తున్న జనం

రొంపిచెర్ల : రొంపిచెర్ల పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండలంలోని మోటుమల్లెల పంచాయతీ ఆదినవారిపల్లెకు చెందిన రత్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. తనని సారా కేసులో ఇరికించారని, పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని న్యాయం చేయాలని బాధితుడు ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నాడు. అలాగే పెద్దమల్లెల పంచాయతీలోని నడింపల్లెలో ఎంపీ మిధున్ రెడ్డి నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌కు కాయిన్ బాక్స్‌ను అధికార పార్టీ నాయకులు ఏర్పాటు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో తాగునీటి కోసం పక్కన ఉన్న చిచ్చిలివారిపల్లెకు వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తన సర్వీసును తొలగించారని పెద్దనేనివారిపల్లెకు చెందిన రైతు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. బండల మీద రాళ్లు కొట్టుకునేందుకు టీడీపీ నాయకులు అభ్యంతరం చెబుతున్నారని వడ్డెరలు వాపోయారు. బండలను వేలం పాట వేసి ఇస్తామని బెదిరిస్తున్నారని పెద్దిరెడ్డికి వివరించారు. మండలంలో అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా పని చేస్తున్నారని పలువురు ఎమ్మెల్యేకు తెలియజేశారు. అధికార పార్టీ నాయకుల దాడులు, దౌర్జన్యాలు మానుకోకపోతే వారికి అదే విధంగా సమాధానం చెబుతామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి హెచ్చరించారు.

### మంచుకొండల్లో వైఎస్సార్‌సీపీ జెండా



జమ్ము-కశ్మీర్‌లోని మంచుకొండల్లో వైఎస్సార్‌సీపీ జెండాతో అభిమానులు

– వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్ష

పలమనేరు: పెద్దపంజాణి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ అభిమానులు జమ్మూ-కశ్మీర్‌లోని మంచు లోయల్లో వైఎస్సార్‌సీపీ జెండాను ప్రదర్శించారు. కమ్మేపల్లికి చెందిన ఆ గ్రామానికి చెందిన ధనరాజు, శ్రీనాథరెడ్డి రెండ్రోజుల క్రితం జమ్మూ-కశ్మీర్‌లోని మంచు కొండలెక్కారు. వైఎస్సార్‌సీపీ జెండాను చూపుతూ తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. జెండాతో సెల్ఫీలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

# బైక్ దొంగ అరెస్టు : వాహనాల స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ ఎండీ అజీజ్, సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్

కార్వేటినగరం : ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద బుధవారం చోటు చేసుకుంది. నగరి డీఎస్పీ ఎస్.ఎండీ అజీజ్ కథనం మేరకు వివరాలిలా... కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లి పంచాయతీ వావిళ్ల చేను గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు చంద్రబాబు బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు పార్కింగ్ చేసిన వాహనాలను అపహరించి తక్కువ ధరలకే అమ్మి వచ్చిన సొమ్ములతో జల్సాలకు పాల్పడుతూ వచ్చాడు. దీంతో చోరీకి గురైన వాహన యజమానులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీలను పరిశీలించి వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న చంద్రబాబును కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ సిబ్బందితో కలసి పట్టుకున్నారు. చంద్రబాబును అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టడంతో ఆరు వాహనాలు చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించినట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితుడి బైక్‌తో పాటు మరో ఆరు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఈ కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందికి డీఎస్పీ రివార్డును అందించి, సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్‌ను అభినందించారు.

### నేడు బైక్ ర్యాలీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జాతీ య రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డీటీసీ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల కు కార్యాలయం నుంచి 300 బైకులతో ఈ ర్యాలీ జరుగుతుందని ఆయ న పేర్కొన్నారు.

### బాలికపై లైంగిక వేధింపుల కేసులో ఇద్దరికి జైలు

చిత్తూరు అర్బన్ : బాలికపై లైంగిక వేధింపుల కేసులో చరణ్ (29), షేక్ హమీద్ (24) అనే ఇద్దరు నిందితులకు రెండేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 2 వేల జరిమానా విధిస్తూ చిత్తూరులోని బాలలపై లైంగిక వేధింపుల విచారణ (పోక్సో) న్యాయస్థానం బుధవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతి కథనం మేరకు.. సదుం మండలం చెరుకువారిపల్లెకు చెందిన చరణ్, తిరుపతి నగరానికి చెందిన షేక్ హమీద్ ఇద్దరూ స్నేహితులు. వీరు మదనపల్లెలో పెయింటింగ్ పనులు చేయడానికి వెళ్లారు. 2022 ఫిబ్రవరి 27వ తేదీన మదనపల్లెలో 14 ఏళ్ల వయస్సున్న బాలికను అపహరించి, లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. దీనిపై బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మదనపల్లె పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి తీర్పునిచ్చారు.